క్లుప్తంగా

98 శాతం పెన్షన్ల పంపిణీ



నాదెండ్ల: మండలంలోని 16 సచివాలయాల పరిధిలో ఆదివారం చివరిరోజు వైఎస్సార్ పెన్షన్ కానుక - సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీ 98 శాతం పూర్తయింది. వలంటీర్లు ఉదయాన్నే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్ నగదు అందించారు. మండల పరిధిలో 9701 మంది లబ్ధిదారులకు గాను రూ.2,67,47,500లు పంపిణీ చేస్తున్నారు. ఎంపీడీఓ షేక్ జాకీర్‌హుస్సేన్, ఆయా సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించారు. గణపవరంలోని రెండో సచివాలయం పరిధిలో వృద్ధాప్య పింఛను లబ్ధిదారు పాలపర్తి దయమ్మకు వలంటీర్ అన్నమ్మ పింఛను నగదు పంపిణీ చేశారు.

హైదరాబాద్ వెళ్లి పింఛను అందజేత..

నాదెండ్ల: పక్షవాతంతో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న సాతులూరు గ్రామానికి చెందిన వృద్ధాప్య పింఛను లబ్ధిదారు ఈదర కోటేశ్వరరావుకు వైఎస్సార్ సామాజిక భద్రతా పింఛను నగదును వలంటీర్ మహేష్ ఆదివారం హైదరాబాద్‌కు వెళ్లి అందించారు. కోటేశ్వరరావు గత పది నెలలుగా పక్షవాతంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని తన కుమారుని నివాసంలో ఉంటూ చికిత్స పొందుతున్నాడు. నడవలేని స్థితిలో ఉన్న కోటేశ్వరరావుకు ఆదివారం పింఛను సొమ్ము అందించటంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శి ముదవర్తి రమేష్, సచివాలయ సిబ్బందిని అభినందిస్తూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కోటేశ్వరరావు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. వలంటీర్ వ్యవస్థ వచ్చాక లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వచ్చి పింఛను అందిస్తుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెంలో వేంచేసియున్న మహంకాళి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి హైద్రాబాద్‌కు చెందిన చందలూరి రవికుమార్, కల్పన దంపతులు రూ.1,01,116లు విరాళంగా అందజేశారు. ఆలయ కార్యాలయంలో ఆదివారం ఆలయ ఈఓ టి.సుధాకరరెడ్డికి విరాళం చెక్‌ను దాతలు అందించారు. ఆలయ పునర్నిర్మాణంలో దాతలు విరాళాలు అందజేసి సహకరించాలని ఈఓ సుధాకరరెడ్డి కోరారు. విరాళాలు ఇచ్చే దాతలకు ఆదాయపు పన్ను మినహాయింపు ఉంటుదని తెలిపారు.

ఊపిరితిత్తుల సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు



నాదెండ్ల: ఊపిరితిత్తుల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటే దీర్ఘకాలిక వ్యాధిగా మారకుండా నివారించవచ్చని ప్రముఖ పల్మనాలజిస్ట్ డాక్టర్ నంద్యాల రాంప్రసాద్‌రెడ్డి చెప్పారు. సాతులూరు గ్రామంలో ఆదివారం నాదెండ్ల మండల పరిధిలోని ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులకు నంద్యాల హాస్పటల్స్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ ఊపిరితిత్తులకు సోకే ఇన్‌ఫెక్షన్లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు షేక్ బాజీ, కమ్యూనికేటర్ ఆరేటి నాగేశ్వరరావు, మండల అధ్యక్షుడు షేక్ నాగూర్‌వలి, కోశాధికారి జగన్‌మోహన్‌రావు, సభ్యులు ఆవుల శ్రీనివాసరావు, రామారావు పాల్గొన్నారు.

పాముకాటుకు గేదె మృతి

నాదెండ్ల: పొలంలో మేత మేస్తున్న గేదెను పాము కాటు వేయటంతో మృతి చెందిన సంఘటన మండలంలోని సాతులూరు గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. బాధిత రైతు బండారుపల్లి రాఘవ ఆదివారం ఉదయం గేదెలను మేపేందుకు పొలానికి తోలుకెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో పాముకాటుకు గురై గేదె మృతి చెందింది. మృతిచెందిన గేదె విలువ రూ.90 వేలు ఉంటుందని రైతు తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమాలకు పెద్దపీట

- అన్నారం గ్రామంలో రూ.9.8కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



వృద్ధురాలికి సంక్షేమ పథకాల కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

రొంపిచర్ల: గత నాలుగున్నర ఏళ్లలో అన్నారం గ్రామంలో రూ.9.8కోట్లతో గ్రామస్తులకు సంక్షేమం, అభివృద్ధి అందజేసినట్లు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రాత్రి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలుత రామాలయంలో పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ అమ్మఒడి, చేయూత, ఆసరా, రైతు భరోసా లాంటి పథకాలను పార్టీలకు అతీతంగా ప్రతి ఇంటికి అందజేశామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పినట్లుగా ప్రతి పేదవాడికి ఆరోగ్య సురక్ష ద్వారా వైద్యం అందజేస్తున్నామన్నారు. గ్రామంలో రూ.2.70కోట్ల వ్యయంతో ఎస్సీ కమ్యూనిటీ హాలు, సీసీ రోడ్లు, డ్రెయిన్ల అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండుకళ్లుగా భావిస్తూ అందజేస్తున్నామన్నారు. వచ్చే ఎన్నికల్లో 175కి 175 స్థానాలు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. మాచర్ల, వినుకొండలో సామాజిక యాత్ర విజయవంతమైందన్నారు. ఈనెల 14న నరసరావుపేటకు సామాజిక బస్సుయాత్ర వస్తుందన్నారు. ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఎంపీపీ గడ్డం వెంకటరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పడాల సాంబశివారెడ్డి, పచ్చవ రవీంద్రబాబు, బత్తుల రామకృష్ణ, అన్నెం పున్నారెడ్డి, ఎంపీటీసీ రమేష్, కోడూరి వెంకటేశ్వరరెడ్డి, జిడ్డు వీరయ్య, పడాల చక్రారెడ్డి, కల్లం శివారెడ్డి, గాజుల మాణిక్యం, మానుకొండ వాసుదేవరెడ్డి, కంచేటి రామారావు, పానుగోటి నాసరరావు, కసిరెడ్డి వెంకటకోటిరెడ్డి, కాసినీడి మస్తానయ్య, కామినేని వెంకయ్య, గుండాల వెంకటేష్ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో లోపాలు ఉండకూడదు

- అధికారులకు ఆర్డీఓ ఎం.శేషిరెడ్డి సూచన
- మునుమాక, విప్పర్లపల్లిలలో పోలింగ్ బూత్‌ల పరిశీలన



పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ ఎం. శేషిరెడ్డి



బొల్లాపల్లిలో పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న ఏఈఆర్ఓ ఎం.దుర్గేశ్వరరావు

రొంపిచర్ల: ఓటర్ల జాబితాలో ఉన్న సవరణలలో లోపాలు లేకుండా చూడాలని ఆర్డీఓ ఎం.శేషిరెడ్డి అన్నారు. మండలంలో మునమాక గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో గల పోలింగ్ బూత్ నెం. 55, 56లలో, విప్పర్లపల్లి గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో గల పోలింగ్ బూత్ నెం. 56, 57లలో ఆదివారం ఓటర్ల జాబితాలో సవరణల పరిశీలన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీఓ ఎం.శేషిరెడ్డి మాట్లాడుతూ ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. జీరో డోర్ నెంబరు, ఒకే ఇంటి నెంబరుతో ఉన్న పదికి మించి ఓటర్లుగా నమోదైన వారి వివరాలను ఆయా ఇళ్లకు వెళ్లి పరిశీలించాలన్నారు. వీటిని సవరణలు చేసేందుకు ఫారం-8, చనిపోయిన ఓటర్లను తొలగించేందుకు కుటుంబ సభ్యుల నుంచి ఫారం -7 తీసుకోవాలని, అర్హత గల ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేసేందుకు ఫారం-6 తీసుకోవాలని అన్నారు. శాశ్వతంగా నివాసం ఉండని ఓటర్లను గుర్తించి ఫార్మెట్-బి, డబుల్ ఓట్లు గల వారిని గుర్తించి ఫార్మెట్-ఎ లో పొందుపరచాలని ఆదేశించారు. పోలింగ్ బూత్ అధికారులు వీటిపై అశ్రద్ధ చేస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. తహసీల్దారు జి.అంకారావు, వీఆర్ఓలు, పోలింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కు నమోదు చేయించుకోండి

బొల్లాపల్లి: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండలంలోని పోలింగ్ బూత్‌ల్లో ఈనెల 4,5 తేదీల్లో రెండు రోజులు ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహించారు. ఆయా పోలింగ్ బూత్‌ల్లో ముసాయిదా ఓటర్ల జాబితా ప్రదర్శించిన అనంతరం మరోసారి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ఓటరు నమోదు ప్రక్రియకు రెండు రోజుల క్యాంపెయిన్ నిర్వహించడమైందని మండల తహసీల్దార్, ఏఈఆర్ఓ ఎం.దుర్గేశ్వరరావు తెలిపారు. మండలంలోని 33 పంచాయతీల్లో మొత్తం ఓటర్లు 54,799, ఇందులో మహిళలు 25,574, పురుషులు 26,221, థర్డ్ జండర్ నలుగురిగా ఓటరు జాబితా ప్రదర్శించడమైందని చెప్పారు. ఈ ప్రత్యేక క్యాంపెయిన్‌లో ఫారం -6, 7, 8, 8ఎ సమర్పించుకోవచ్చని, అర్హత కలిగిన వారు నూతన ఓటరు నమోదు, తొలగింపు, మార్పులు, పోలింగ్ బూత్ మార్చుకోవడం వంటి దరఖాస్తులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ చేసుకోవచ్చని ఏఈఆర్ఓ తెలిపారు.

ఓటు నమోదుకు 27 దరఖాస్తులు

నాదెండ్ల: మండలంలోని 57 పోలింగ్ బూత్‌ల్లో ఆదివారం రెండో రోజు బీఎల్ఓలు ఓటు నమోదు కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. అన్ని బూత్‌ల వద్ద ఫారం-6, 7, 8ల కోసం ఆదివారం 27 దరఖాస్తులు స్వీకరించారు. గతంలో 61 దరఖాస్తులు అందాయి. రెండు రోజుల్లో 88 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ ఎస్.నాగమల్లేశ్వరరావు తెలిపారు.

బీఎల్ఓలు సమర్థంగా పనిచేయాలి

- చిలకలూరిపేట నియోజకవర్గ ఎన్నికల అధికారి జి.వసంతబాబు
- యడ్లపాడులోని పోలింగ్ కేంద్రాల ఆకస్మిక పరిశీలన



యడ్లపాడు లూథరన్ హైస్కూల్‌లో బీఎల్ఓలకు సూచనలు చేస్తున్న జి.వసంతబాబు

యడ్లపాడు: బూత్ లెవల్ అధికారులు సమర్థవంతంగా పని చేయాలని చిలకలూరిపేట నియోజకవర్గం ఎన్నికల అధికారి జి.వసంతబాబు చెప్పారు. మండల కేంద్రమైన యడ్లపాడు గ్రామంలోని లూథరన్ ఉన్నత పాఠశాలను ఆదివారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలోని 87 నుంచి 95 వరకు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ప్రత్యేక ఓటు నమోదు ప్రక్రియ వివరాలను బీఎల్ఓలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం బూత్ లెవల్ అధికారులు పనిచేయాలన్నారు. ఎన్నికల విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండి ఓటర్లకు, ప్రజలకు సేవలు అందించాలని ఆదేశించారు. ఓటు నమోదు, తొలగింపుల ప్రక్రియపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆర్ఐ చక్రవర్తి, యడ్లపాడు పంచాయతీ కార్యదర్శి శశికళ, ఎన్నికల సూపర్‌వైజర్లు ఉన్నారు.

రెండోరోజు క్యాంపులో 169 అర్జీలు..

మండలంలోని 57 పోలింగ్ కేంద్రాల్లో ఆదివారం ఎన్నికల కమిషన్ ఆదేశాలలో నిర్వహించిన స్పెషల్ క్యాంపులో స్థానిక ప్రజల నుంచి మొత్తం 169 అర్జీలు అందినట్లు తహసీల్దార్ వైవీబి కుటుంబరావు తెలిపారు. వీటిలో ఫారం (6)..52, ఫారం (7)..34, ఫారం(8)..73 వచ్చినట్లు వెల్లడించారు.

కళాకారుల సంక్షేమ సంఘం సమావేశం



వినుకొండ(నూజెండ్ల): నియోజకవర్గస్థాయి కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్యవర్గ ముఖ్య సమావేశం ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీనియర్ కళాకారుడు షేక్ సత్తార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులకు గుర్తింపు కార్డులు, తదితర సంక్షేమ అంశాలపై చర్చించారు. 5 మండలాల కార్యవర్గ సభ్యులను నియమించి దుశ్శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. సంఘం అధ్యక్షుడు కుంపటి మహేష్‌బాబు, ట్రెజరర్ చెన్నుపల్లి గోవింద్, పేర్నిపోగు ఎజ్రా, సూరాబత్తిని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల చదువులపై తల్లిదండ్రులు శ్రద్ధ పెట్టాలి

ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న యండమూరి వీరేంద్రనాథ్

నరసరావుపేట ఈస్ట్: తల్లిదండ్రులు తమ పిల్లలను కష్టపడి చదవమని ప్రేరేపించేకన్నా ఇష్టపడి చదవమని ప్రోత్సహించాలని ప్రముఖ రచయిత, వ్యక్తిత్వ వికాస నిపుణులు, విద్యావేత్త యండమూరి వీరేంద్రనాథ్ తెలిపారు. ప్రకాష్‌నగర్‌లోని టౌన్‌హాల్‌లో ఆదివారం ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో యండమూరి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పిల్లలను గారాబం చేయకుండా ప్రేమతో వారి చదువులపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. చదువు చాలా బాగుంటుందనీ, ఉన్నత చదువులతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని వారికి తెలియచెప్పాలని తెలిపారు. విద్యార్థుల చేతిరాత బాగుండేలా చూడాలన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేసిన ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ తమ విద్యార్థులను గ్లోబల్ లీడర్స్‌గా తీర్చిదిద్దాలని యాజమాన్యాన్ని కోరారు. స్కూల్ కార్యదర్శి నాగోతు ప్రకాశరావు మాట్లాడుతూ, అధునాతన మౌలిక వసతులు, అపార అనుభవం గల ఉపాధ్యాయుల బృందంతో వచ్చే విద్యా సంవత్సరం నుంచి తమ స్కూల్ కార్యకలాపాలు ప్రారంభిస్తున్నామని తెలిపారు. చదువుతో పాటు క్రీడలలో శిక్షణ ఇస్తామన్నారు. స్కూల్ ఏపీ హెడ్ ఎ.రామరాజు మాట్లాడుతూ, విద్యారంగంలో పేరుగాంచిన పల్నాడుజిల్లా కేంద్రమైన నరసరావుపేటలో తమ స్కూల్ ఏర్పాటు చేయటం ఆనందంగా ఉందన్నారు. స్కూల్‌లో 2వతరగతి నుంచి 9వతరగతి వరకు అడ్మిషన్ ప్రక్రియ ప్రారంభించామని, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐడీపీఎస్ జాతీయ ఫ్రాంచైజ్ హెడ్ సుభాష్ కలువ, శ్రీదత్త హాస్పటల్ ఎండీ డాక్టర్ గార్లపాటి కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు. తొలుత ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆధ్వరంలో నిర్వహించిన స్కాలర్‌షిప్ టెస్ట్‌కు జిల్లా నలుమూలల నుంచి అధికసంఖ్యలో విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరయ్యారు.

వైభవంగా ఐదు మండపాల పడిపూజ

నాదెండ్ల: గణపవరం కోదండరామాలయంలో అయ్యప్పస్వాముల ఐదు మండపాల దివ్య పడిపూజ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. సత్తెనపల్లికి చెందిన అష్టదశ శక్తి పీఠాధిపతి గణపతి రామ్మోహనానంద స్వామి ఆధ్వర్యంలో ఐదు మండపాలైన అయ్యప్ప, శివుడు, విఘ్నేశ్వరుడు, కుమారస్వామి, వేంకటేశ్వరస్వాములకు అభిషేకాలు పూజలు నిర్వహించారు. బాపట్లకు చెందిన మణికంఠ కొండలు బృందం ఆధ్వర్యంలో జరిగిన అయ్యప్ప గీతాలాపనలు భక్తులను అలరించాయి. పడి పూజ అనంతరం 18ఏళ్ల పడిపూజ పూర్తి చేసుకున్న 25 మంది గురుస్వాములను శాలువాలు, పూల మాలలతో సత్కరించి మెమొంటోలు అందించారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు వాగ్దేవి విద్యార్థులు



రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికైన విద్యార్థులతో వాగ్దేవి కళాశాల యాజమాన్య ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఒ.నాగేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఈనెల 2వ తేదీన ఖాజీపాలెంలో నిర్వహించిన ఉమ్మడి గుంటూరుజిల్లా జట్టు ఎంపిక పోటీలలో తమ విద్యార్థులు అండర్-19 విభాగంలో గుత్తికొండ మోహన్ (డిస్కస్ త్రో, జావలిన్ త్రో), జజ్జూరి యశ్వంత్ (రన్నింగ్), కె.గోపిచంద్ (డిస్కస్ త్రో), రావెళ్ల వెంకటసాయి (ట్రిపుల్ జంప్), షేక్.షాజహాన్‌బి (డిస్కస్ త్రో, షాట్‌పట్), ఎస్.వినీల, ఎం.సౌమ్య, బి.వెన్నెల (రన్నింగ్), అండర్-17 విభాగంలో షేక్.అల్మాస్ (హర్డిల్స్) ప్రతిభ చూపి జిల్లా జట్టుకు ఎంపికైనట్టు వివరించారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల కార్యదర్శి రాయల శ్రీనివాసరావు, డైరెక్టర్లు కాట్ల రామకోటేశ్వరావు, కపలవాయి రాజేంద్రప్రసాద్, పి.కృష్ణారావు, పి.వి.అచ్యుతరావు, పీడీ రాయల ఆంజనేయులు తదితరులు అభినందించారు.

రామలింగేశ్వర దేవాలయ పునర్నిర్మాణానికి విరాళం



ఆలయ కమిటీ సభ్యులతో అసోసియేషన్ సభ్యులు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని కొండపై వేంచేసి ఉన్న రామలింగేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి సాయి పతాంజలి యోగా అసోసియేషన్ ప్రెసిడెంట్ కన్నెగండ్ల అనంత కోటేశ్వరరావు ఆధ్వర్యంలో రూ.5లక్షలు విరాళాలు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కొండపై జరుగుతున్న పనులను కమిటీ సభ్యులతో కలిసి అసోసియేషన్ సభ్యులు పరిశీలించారు. ప్రసన్నాంజనేయ ఫర్టిలైజర్స్ రూ.1,00,116, చిన్ని ఐరామ్మూర్తి రూ.51,216లు, వెంకటరమణ ప్రింటింగ్ ప్రెస్, చిలంకూరి సురేష్‌బాబు, గుండా బాలయ్య, గుడిపాటి నాగేశ్వరరావులు రూ.51,116లు చొప్పున, మొగిలి మల్లికార్జునరావు, పులికొండ శ్రీనివాసరావు, సూర్య దాల్ ఇండస్ట్రీస్, శంకర్, పొత్తూరి సుబ్బారావులు రూ.25,116ల చొప్పున అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పెండేల పుల్లారావు, పులిపాటి రామారావు, జాజుల మాల్యాద్రి, రెడ్డి నగేష్‌బాబు, గంధం బాలిరెడ్డి, ములకా రామతులసిరెడ్డి, గజవల్లి నాగపవన్‌కుమార్, చందోలు మల్లికార్జునరావు, అచ్యుత కృష్ణ పాల్గొన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్ని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

యోగి వేమారెడ్డి సేవా సమితి నూతన కార్యవర్గం



సమితి నూతన కార్యవర్గం

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని యోగి వేమారెడ్డి సేవా సమితి బిల్డింగ్‌లో ఆదివారం వినుకొండ నియోజకవర్గ సేవా సమితి జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 2023-26 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గం కమిటీ ఎన్నిక కార్యక్రమం జరిందిి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెడ్ల సమాఖ్య గౌరవ అధ్యక్షుడు పాలిమేర వెంకటరెడ్డి, కోటప్పకొండ రెడ్ల సత్రం వర్కింగ్ ప్రెసిడెంట్ కంజుల వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యోగి వేమన, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇటీవల మరణించిన పడిగపాటి అచ్చిరెడ్డి, మానుకొండ సుబ్బారెడ్డిలకు రెండు నిముషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. సమితి అధ్యక్షుడిగా ఆరె శివారెడ్డి, ప్రధానకార్యదర్శిగా పెద్దిరెడ్డి సుధాకరరెడ్డి, కోశాధికారిగా యారం రామిరెడ్డి, ఉపాధ్యక్షులు 10 మంది, సంయుక్త కార్యదర్శులుగా 10 మందిని ఎన్నుకున్నారు. డాక్టర్ చిన్నపరెడ్డి, పగడాల వెంకటరామిరెడ్డి, ఎంపీపీ మేడం జయరామిరెడ్డి మాజీ ఎంపీపీ ములకా రామతులసిరెడ్డి, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ గంధం బాలిరెడ్డి, ఎరుకలరెడ్డి, భాస్కరరెడ్డి, సుందరరెడ్డి, మునగాల లక్ష్మీరెడ్డి, తుమ్మా రామకృష్ణారెడ్డి, కొత్త కృష్ణారెడ్డి, కర్నాటి చెన్నకేశవరెడ్డి, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బిందు సేద్యం విధానాన్ని అవలంభించాలి

శావల్యాపురం: ఉద్యాన పంటలు సాగు రైతులు బిందు సేద్యం సాగును అవలభించాలని ఉద్యానశాఖాధికారి షేక్ నబీ రసూల్ ఆదివారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షం వలన పంటలకు ప్రాణం పోసినట్లు ఉందన్నారు. దీంతో రైతులకు ఉపశమనం కలిగిందన్నారు. మిరప పంట సాగు చేసే రైతులు బిందు సేద్యం విధానాన్ని అవలింభించడం ద్వారా సాగు నీరు వృథా కాకుండా పంటలకు సంరక్షణతో పాటు, ఎకరం సాగుకు వినియోగించే నీరు మూడు ఎకరాల మేర సాగు చేయటానికి వీలుగా ఉంటుందన్నారు. ప్రస్తుతం మిరప పంట ఎదుగుదల దశలో ఉండటంతో పాటు కొన్ని ఏరియాలో పూత దశలో ఉందన్నారు. నీటి వసతి ఉన్న ఏరియాలో రైతులు అధికంగా మిరప పంటను సాగు చేశారన్నారు. బెట్ట పరిస్థితులను అధిగమించటానికి రైతులు తప్పనిసరిగా యూరియా ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. ఈవిధంగా చేయటం వలన భూమిలో తేమ శాతం తగ్గకుండా ఉంటుందన్నారు. అలాగే పంట బెట్ట దశ సూచనలు కనిపిస్తే రసం పీల్చు పురుగులు, పైముడత, కింద ముడత వైరస్ సోకకుండా తెగుళ్ల నివారణకు ముందుస్తు జాగ్రత్తలో భాగంగా ఒక్కో ఎకరానికి 100 ఎంఎల్ వేపనూనె, హిమోడాక్లోప్రిడ్ రసాయనిక ఎరువులను పిచికారీ చేయాలన్నారు.

దాడి ఘటనపై పరస్పర కేసులు

నరసరావుపేట టౌన్: ఇరువురు యువకులు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న సంఘటనపై రెండు కేసులు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ వీరేంద్రబాబు ఆదివారం తెలిపారు. ఐలాబజారుకు చెందిన నిమ్మిశెట్టి నాగేంద్రబాబుకు రావూరి నాగవిజయకుమార్ మధ్య శనివారం రాత్రి వివాదం నెలకొంది. ఈ క్రమంలో ఇద్దరు ఒకరిపై ఒకరు బీరు సీసాలతో దాడికి పాల్పడ్డారు. సంఘటనలో ఇరువురికి గాయాలయ్యాయి. ఈ మేరకు బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో రెండు కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నేటి నుంచి 'ఉపాధి' గుర్తింపు గ్రామసభలు

వినుకొండ(నూజెండ్ల): ఉపాధి హామీ పథకంలో భాగంగా నూజెండ్ల మండలంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పనుల గుర్తింపు గ్రామసభలు సోమవారం నుంచి నిర్వహించడం జరుగుతుందని ఏపీఓ కట్టా నాగేశ్వరరావు తెలిపారు. ఈ నెల 6వ తేదీన తిమ్మాపురం, గురప్పనాయుడుపాలెం, తెల్లపాడు, కంభంపాడు, 7న ఉప్పలపాడు, తలార్లపల్లి, అప్పాపురం, మారెళ్లవారిపాలెం, 9న పుచ్చనూతల, ముప్పరాజువారిపాలెం, జంగాలపల్లి, త్రిపురాపురం, 10న చెరుకుంపాలెం, కొత్తజడ్డవారిపాలెం, పాతజడ్డవారిపాలెం, ముక్కెళ్లపాడు, 13న చింతలచెరువు, మూర్తింజాపురం, లింగముక్కపల్లి, పాత నాగిరెడ్డిపల్లి, 14న పువ్వాడ, ములకలూరు, నూజెండ్ల, 15న ఐనవోలు, పెద్దవరం, ముతరాసువారి పాలెం, పమిడిపాడులో గ్రామసభలు జరుగుతాయని తెలిపారు.

రేపటి నుంచి కనమర్లపూడి ప్రతిష్టా వేడుకలు ప్రారంభం

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి గ్రామంలో ఈనెల 7వ తేదీ నుంచి గ్రామదేవతలు పోలేరమ్మ, కనకమ్మ, పెద్దమ్మ అద్దంకమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవారి నూతన దేవాలయాలు ప్రతిష్టా వేడుకలు ప్రారంభం అవుతాయని ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతిష్టా వేడుకలు పోలేరమ్మ దేవాలయ ప్రాంగణంలో యాగశాల వద్ద ఈనెల 9వ తేదీ ఉదయం 7.15 నిమిషాలకు ఆగమ సిద్ధాంతి వేదపండితులు పోట్ల హరినాథ్ శర్మ సారథ్యంలో వైభవంగా జరుగుతాయన్నారు. చివరిరోజు పోలేరమ్మ అమ్మవారి దేవాలయం సన్నిధిలో భారీ అన్నదానం సంతర్పణ కార్యక్రమాలతో ముగిస్తాయన్నారు.